సాక్షి
పశ్చిమగోదావరి

శనివారం । 14 । జనవరి । 2023

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద రంగవల్లులు తీర్చదిద్దుతున్న ఉద్యోగినులు



సంక్రాంతి సంబరం..
సంప్రదాయ దర్పణం



తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లిలో రంగవల్లుల పోటీలు

మది నిండుగా.. పెద్ద పండగ.. ఊరూవాడా సంక్రాంతి సంబరాలు మొదలయ్యాయి.. ముందస్తు వేడుకలతో వై'భోగి'ంగా స్వాగతం పలికాయి.. భోగభాగ్యాలనిచ్చే భోగిని ఆహ్వానిస్తూ రంగవల్లుల పోటీలు ఆకట్టుకున్నాయి. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు దర్పణమై నిలిచాయి. ఉభయ పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా పండగ సందడి కనిపిస్తోంది.

– సాక్షి నెట్‌వర్క్



పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు మున్సిపల్ కార్యాలయం వద్ద..



కాళ్ల : జక్కరంలో భోగి మంటకు ఏర్పాట్లు

న్యూస్‌రీల్

సంక్రాంతి శుభాకాంక్షలు



మంత్రి కారుమూరి

తణుకు అర్బన్/భీమవరం (ప్రకాశంచౌక్): సంక్రాంతి పండగను జిల్లా ప్రజలంతా సుఖ సంతోషాలతో జరుపుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, కలెక్టర్ పి.ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ జేవీ మురళి అన్నారు. ప్రజలంతా సుఖసౌఖ్యాలు, భోగభాగ్యాలతో, రైతులు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ పండగ శుభాకాంక్షలు తెలిపారు. ధాన్యం సొమ్ములు ఇప్పటికే బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు.

శ్రీవారి సేవలో సినీ హీరో కిరణ్



అభిమానితో కిరణ్ అబ్బవరం

ద్వారకాతిరుమల/జంగారెడ్డిగూడెం రూరల్: ద్వారకాతిరుమల చినవెంకన్న, గురవాయిగూడెంలోని మద్ది ఆంజనేయస్వామి ఆలయాలను సినీ హీరో కిరణ్ అబ్బవరం శుక్రవారం సందర్శించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించారు. ద్వారకాతిరుమలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సమ్మతమే, ఎస్ఆర్ కల్యాణ మండపం, రాజావారు రాణిగారు, నేను మీకు బాగా కావాల్సినవాడిని చిత్రాలు తనకు మంచి గుర్తింపు తెచ్చాయన్నారు. ప్రేక్షకులు తన చిత్రాలను ఆదరిస్తున్నారని, రాబోయే సినిమా వినరో భాగ్యము విష్ణుకథ మహాశివరాత్రికి విడుదల కానుందన్నారు. గోదావరి జిల్లాల్లో జరిగే సంక్రాంతి సంబరాల్లో పాల్గొనేందుకు తాను ఇక్కడికి వచ్చానన్నారు.

మావుళ్లమ్మ వార్షిక మహోత్సవాలు ప్రారంభం



ఉత్సవాలను ప్రారంభిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం మావుళ్లమ్మవారి 59వ వార్షిక మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక వాహనంపై కొలువుదీరిన అమ్మవారి ఉత్సవ మూర్తికి ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ కుమారుడు గ్రంధి రవితేజ, నీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘ సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలను ప్రారంభించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మద్దిరాల మల్లికార్జునశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం సహాయ కమిషనర్ యర్రంశెట్టి భద్రాజీ, దేవస్థాన చైర్మన్ మానేపల్లి నాగేశ్వరరావు, నీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం సభ్యులు, అమ్మవారి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రామాయణం గోవిందరావు, ఉపాధ్యక్షుడు కొప్పుల సత్యనారాయణ, ధర్మకర్తలు పాల్గొన్నారు.

ఉత్సవాల్లో నేడు

శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు గోగులమ్మ భజన సమాజం (భీమవరం) వారిచే భజన, సాయంత్రం నాలుగు గంటలకు గాయత్రి సుమద్యుతి (విశాఖ) వారిచే భక్త సంగీతం, సాయంత్రం ఐదు గంటలకు విఘ్నేశ్వర బృందం (తాడేపల్లిగూడెం)చే బుర్రకథ, రాత్రి ఎనిమిది గంటలకు పంపన లక్ష్మీదేవి ముసలయ్య సాంస్కృతిక సేవా సంస్థ (వనస్థలిపురం) వారిచే రుక్మిణీ పరిణయం నాటకం ప్రదర్శించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

వందే భారత్‌కు స్వాగత సన్నాహాలు

ఏలూరు (టూటౌన్): దేశంలో వేగంగా నడిచే రైలును వందే భారత్ పేరుతో రైల్వేశాఖ ప్రారంభానికి సన్నాహాలు చేస్తుంది. దీనిలో భాగంగా ఈనెల 15 సంక్రాంతి పండగను పురస్కరించుకుని సికింద్రాబాద్–విశాఖ మధ్య కొత్తగా నడిచే రైలును ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. ఈ ఎక్స్‌ప్రెస్ రైలు వరంగల్, ఖమ్మం, విజయవాడ, రాజమండ్రి స్టేషన్లలో మాత్రమే ఆగనుంది. ఈ నేపథ్యంలో ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు స్టేషన్లలో రైలుకు స్వాగతం పలికేలా రైల్వే అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు ఆయా స్టేషన్ల పరిధిలోని ఎంపీ, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులకు ఆహ్వానాలు పంపుతున్నారు. అదేరోజు రైలు సాయంత్రం ఏలూరుకు సాయంత్రం 4.10 గంటలకు, తాడేపల్లిగూడెంకు 4.41 గంటలకు, నిడదవోలుకు 4.55 గంటలకు చేరుకుంటుంది. ఉమ్మడి జిల్లాలో హాల్ట్ ఇవ్వకపోవడంపై ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జగనన్న కాలనీల్లో..
సంక్రాంతి సందళ్లు

- తొలిసారి సొంతింట్లో సంక్రాంతి పండగ
- బంధువుల రాకతో వెల్లివిరిసిన సంతోషం
- పట్టరాని ఆనందంలో కుటుంబాలు
- ఇంటింటా పిండివంటల ఘుమఘుమలు



ముదునూరులో ముగ్గులు పెడుతున్న మహిళలు, (అంతరచిత్రం) గుండుగొలనులో పిండి వంటలు తయారుచేస్తూ..

సాక్షి, పశ్చిమగోదావరి డెస్క్ : జగనన్న కాలనీల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటుతున్నాయి. సొంతింటి కల సాకారం కావడంతో ఆనందంతో పరవశించిపోతున్న లబ్ధిదారులు.. ఈ ఏడాది సంక్రాంతి పండుగను సొంతింట్లో ఆనందోత్సాహాల నడుమ జరుపుకొంటున్నారు. ఇప్పటివరకు అద్దె ఇళ్లలో గడిపిన పేదలు ఓ ఇంటికి యజమానులు కావడం.. సొంతింట్లో జరుపుకొనే తొలి సంక్రాంతి పండుగ ఇదే కావడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోతున్నాయి. కొత్త బట్టలు, పిండి వంటలు, బంధువుల సందళ్లతో ఇళ్లన్నీ కళకళలాడుతున్నాయి. జగనన్న కాలనీలు సంక్రాంతి ముగ్గులతో సరికొత్త శోభ సంతరించుకుంటున్నాయి. పలువురు లబ్ధిదారులు తమ సొంతింట్లో కేకులు కట్ చేసి జగనన్నకు కృతజ్ఞతలు చెబుతున్నారు.

ఊరూరా కొత్త కాలనీలు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సొంతింటి కల సాకారం చేస్తుండటంతో ఊరూరా కొత్త కాలనీలు వెలిశాయి. కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పన ఊపందుకుంది. ఈ ఏడాది పెద్ద పండగ సంక్రాంతిని సొంతింట్లో ఆనందోత్సాహాల నడుమ జరుపుకొంటున్నారు. ఇందులో భాగంగా సొంతింటికి రంగులు వేసుకోవడం, పండగను పురస్కరించుకొని సరంజామా, కొత్త బట్టల కొనుగోలు, పిండివంటల వండుకోవడం.. ఇలా పండగ హడావుడిలో జగనన్న కాలనీలవాసులు బిజీగా ఉన్నారు.

శరవేగంగా గృహప్రవేశాలు

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు ఊపందుకున్నాయి. ఆరు నెలలుగా ప్రతి కాలనీలోనూ ఇళ్లు పూర్తయి నూతన గృహప్రవేశాలు శరవేగంగా జరుగుతున్నాయి. ఏలూరు జిల్లాలో 14,984 ఇళ్లు, పశ్చిమగోదావరి జిల్లాలో 16,779 పూర్తయ్యాయి.

జగనన్న ఇళ్ల వివరాలు

పశ్చిమగోదావరి జిల్లా		ఏలూరు జిల్లా	
మంజూరైనవి	71,864	మంజూరైనవి	88,190
నిర్మాణం పూర్తయినవి	16,779	నిర్మాణం పూర్తయినవి	14,984
వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నవి	51,469	వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నవి	69,266
పనులు ప్రారంభించాల్సినవి	3,616	పనులు ప్రారంభించాల్సినవి	3,940

ఇది మరపురాని అనుభూతి



ఏళ్ల తరబడి అద్దె ఇళ్లలో ఇబ్బందులు పడుతూ కాలం వెళ్లదీసిన మాకు జగనన్న దయ వల్ల సొంతిల్లు ఏర్పడింది. స్థలంతో పాటు ఇల్లు నిర్మించుకునేందుకు లక్షా 80 వేల రూపాయలు ఉచితంగా అందించారు. జగనన్న ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఇంటి నిర్మాణం త్వరగా పూర్తిచేసి ఇటీవలే గృహప్రవేశం చేసుకున్నాం. ఈ ఏడాది తొలి పండగను ఇప్పుడు సొంతింటిలో జరుపుకొంటున్నాం. ఇది మాకు మరపురాని అనుభూతి.

– కిలారి నీలిమ ధనలక్ష్మి, రాంబాబు దంపతులు, జగనన్న కాలనీ, గుండుగొలను, భీమడోలు మండలం

సీఎం జగన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు



గుంటూరు జిల్లా నుంచి ముదునూరు వచ్చి ఇరవయ్యేళ్లయింది. అప్పటి నుంచీ నాకు సొంతిల్లు లేదు. ప్రతి ప్రభుత్వంలోనూ సొంతింటి కోసం దరఖాస్తు పెట్టుకుంటూనే ఉన్నాను. ఎవరూ సొంతిల్లు ఇవ్వలేదు. రాజన్న తనయుడు జగనన్న దయ వల్ల ముదునూరులో ఇంటి స్థలం ఇచ్చి ఇల్లు కట్టుకొనేందుకు ప్రభుత్వం సాయం చేసింది. దీంతో ఇన్నాళ్లకు అద్దె ఇంటి బాధలు తప్పాయి. ఈ ఏడాది ఎంతో సంతోషంగా ఉంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు.

– శిరకొండ సమాధానం, ముదునూరు, పెంటపాడు మండలం

రుణపడి ఉంటాం



ప్రతి సంవత్సరం కన్నా ఈ ఏడు సొంతింటిలో పండగ జరుపుకోవడం ఆనందంగా ఉంది. తాగునీటి సమస్య తప్ప అన్ని సౌకర్యాలూ ఇక్కడ ఉన్నాయి. ఎంతో కాలం నుంచి అద్దె ఇంట్లో పడరాని పాట్లు పడ్డాం. సొంతిల్లు మాకు ఎంతో సంతోషాన్నిస్తోంది. ఇల్లు నిర్మించుకొన్న సందర్భంలో కొంత అప్పులు ఉన్నా తీర్చుకోగలమనే నమ్మకం ఉంది. ముఖ్యమంత్రి జగనన్నకు ప్రత్యేక కృతజ్ఞతలు. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– కొమ్మర సత్యవతి, ముదునూరు జగనన్న కాలనీ, పెంటపాడు మండలం

ఈ ఆనందం జగనన్న చలవే..



వ్యవసాయం చేసుకుని జీవించే మాకు ఇంత తొందరగా సొంతింటి కల నెరవేరుతుందని ఊహించలేదు. జగనన్న దయతో సొంతింటిని నిర్మించుకొని గృహప్రవేశం చేశాం. ఇద్దరు అమ్మాయిలను చదివించుకుంటున్నాం. జగనన్న కాలనీలో సొంతింటిలో తొలిసారి సంక్రాంతి సంబరాలను కూడా నిర్వహించుకుంటున్నాం. ఈ ఆనందం జగనన్న చలవే. సొంతింట్లో తొలిసారిగా పెద్ద పండగ సంక్రాంతిని జరుపుకొంటుండటం ఎంతో సంతోషంగా ఉంది.

– కోసూరి కుమారి, జగనన్న కాలనీ, పెనుమంట్ర గరువు, పెనుమంట్ర మండలం

సంప్రదాయ క్రీడలతో ఉల్లాసం

జిల్లా ఎస్పీ రవిప్రకాష్



నరసాపురంలో భోగి మంట వెలిగిస్తున్న జిల్లా ఎస్పీ రవిప్రకాష్

నరసాపురం: సంక్రాంతి పండగను సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని.. సంప్రదాయ క్రీడలు ముద్దని జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ అన్నారు. స్థానిక వైఎన్ కళాశాల మైదానంలో శుక్రవారం నరసాపురం డివిజన్ పోలీసు శాఖ ఆధ్వర్యంలో సంక్రాంతి క్రీడా సంబరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత జూదాలవైపు వెళ్లకుండా కబడ్డీ లాంటి గ్రామీణ క్రీడలు ఆడుకోవాలన్నారు. కోడిపందేలు, పేకాట, గుండాట వంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. హెచ్చరికతో సరిపెట్టే ప్రసక్తి లేదని, కచ్చితంగా కోడిపందేలు నిర్వహించే పరిస్థితి జిల్లాలో ఉండదని స్పష్టం చేశారు. క్రీడాకారులతో కలిసి ఎస్పీ కొద్దిసేపు వాలీబాల్ ఆడారు. వాలీబాల్, మహిళలకు ముగ్గులు, మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎస్పీ బహుమతులు అందించారు.

2,271 మందిపై బైండోవర్ కేసులు

జిల్లాలో ఇప్పటివరకూ 2,271 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని ఎస్పీ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోడికత్తులు తయారు చేసేవారిని, కత్తులు కట్టే వారిని 164 మందిని గుర్తించి అదుపులోకి తీసుకున్నామన్నారు. 51 బరులను ధ్వంసం చేశామన్నారు. జూదాల నిర్వహణకు స్థలాలు ఇచ్చే యజమానులపైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రత్యేక బృందాల ద్వారా నిఘా ఉంచామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, డీఎస్పీ కె.రవిమనోహరిచారి, సీఐ వి.సురేష్‌బాబు, ఎస్సై సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

● పండగ రద్దీ



వాహనాలన్నీ పల్లెబాట పడుతున్నాయి.. సంక్రాంతి పండగకి సొంత గ్రామాలకు ప్రయాణమవుతుండటంతో రోడ్లన్నీ రద్దీగా కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణతో పాటు పొరుగు జిల్లాల నుంచి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు పెద్ద సంఖ్యలో వాహనాలు వస్తున్నాయి. దీంతో శుక్రవారం కలపర్రు టోల్‌ప్లాజా వద్ద ఓ వైపు బొమ్మలూరు.. మరోవైపు ఏలూరు వై.జంక్షన్ వరకు ట్రాఫిక్ స్తంభించింది. కిలోమీటర్ల మేర వాహన రాకపోకలు నిలిచిపోవడంతో పోలీసులు చర్యలు చేపట్టారు.

– పెదపాడు

ధనాధన్ టోర్నీకి వేళాయె..

సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీకి ఎంట్రీల ఆహ్వానం

SAKSHI DIGITAL MEDIA GROUP · SPL SAKSHI PREMIER LEAGUE

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

Regional sponsor: APMDC · APMDC FOUNDATION

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల (జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్.. ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లాస్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు.. ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22వ తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో... ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్–19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్–25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు. జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం.. ఒక్కో కాలేజీ నుంచి గరిష్ఠంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు : 99124 40768, 99126 71555

గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం

20న రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు

సాక్షి, భీమవరం: ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20, 21 తేదిల్లో భీమవరం విశ్వకవి స్కూల్లో రాష్ట్రస్థాయి స్కూల్ పిల్లల చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాదాసు కిషోర్ చెప్పారు. ఈ పోటీలకు సంబంధించిన వివరాలను శుక్రవారం వెల్లడించారు. అనసూయ చెస్ అకాడమీ, జిల్లా చెస్ అసోసియేషన్ నిర్వహణలో అండర్-7, 9, 11, 13, 15, 17న పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇక్కడి పోటీల్లో విజేతలు ఈ నెల 27 నుంచి అయిదు రోజులపాటు చైన్నైలో నిర్వహించే జాతీయ స్థాయి స్కూల్ చిల్డ్రన్స్ పోటీల్లో రాష్ట్రం తరపున ప్రాతినిథ్యం వహిస్తారని చెప్పారు. మరిన్ని వివరాలకు 90632 24466 నెంబరులో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు తోట హరిబాబు, సంయుక్త కార్యదర్శి ఎం.మురళి పాల్గొన్నారు.


బస్సు ఎక్కేందుకు తంటాలు


ఏలూరు కొత్త బస్టాండ్‌లో బారులు తీరిన ప్రయాణికులు

పండుగ కిటకిట

సంక్రాంతికి పట్నం, నగరం పల్లెబాట పట్టింది. జనం సొంతూళ్లకు వెళ్లేందుకు బస్టాండ్లు, రైల్వే స్టేషన్లకు పోటెత్తడంతో జనంతో కిక్కిరిశాయి. ఏలూరు బస్టాండ్, రైల్వే స్టేషన్‌లో కనిపించిన దృశ్యాలివి.
– ఆర్‌ఆర్ పేట(ఏలూరు)


ప్రయాణికులతో కిటకిటలాడుతున్న ఏలూరు రైల్వేస్టేషన్


కిక్కిరిసిన ఏలూరు కొత్తబస్టాండ్

సంస్కృతికి ప్రతీక సంప్రదాయ క్రీడలు

ఆకివీడు: మన సంస్కృతీ సంప్రదాయాలకు క్రీడలు ప్రతీకగా నిలిచాయని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు చెప్పారు. మండలంలోని దుంపగడపలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కనుమూరి ఆనంద వర్మ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి కబడీ పోటీలు శుక్రవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న మోషేన్‌రాజు మాట్లాడుతూ సంప్రదాయల్ని కొనసాగిస్తూ క్రీడల్ని నిర్వహించిన ఆనంద వర్మను అభినందించారు. అనంతరం మొదటి బహుమతి పొందిన బేతపూడి శ్రీనివాస్(భీమవరం)టీంకు రూ. 30 వేలు నగదు, మోమెంటో అందజేశారు. ద్వితీయ బహుమతి పొందిన వెంకటరత్నం టీంకు రూ. 25 వేలు, మెమెంటోను డీసీసీబీ చైర్మన్ పీవీఎల్.నర్సింహరాజు, తృతీయ బహుమతి పొందిన అయిభీమవరం టీంకు రూ.15 వేలు, మెమెంటోను క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి సర్రాజు అందజేశారు. నాల్గో బహుమతి, ప్రోత్సాహక బహుమతుల్ని గాదిరాజు సుబ్బరాజు, గోకరాజు రామరాజు అందజేశారు. కార్యక్రమంలో కనుమూరి ఆనంద వర్మ, జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు(యండగండి శ్రీను), నగర పంచాయతీ చైర్పర్సన్ జామి హైమావతి, ఎంపీపీ కఠారి జయలక్ష్మీ, వైస్‌చైర్మన్ వంగా జ్యోత్స్న, సర్పంచ్‌లు ముద్దే విశ్వేశ్వరరావు, గాలి సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.


కబడ్డీ విజేతలకు మెమెంటో అందజేస్తున్న మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, చిత్రంలో పీవీఎల్ నర్సింహ రాజు, పాతపాటి సర్రాజు

డివైడర్‌ను ఢీకొట్టిన కారు

ముగ్గురు మహిళలకు గాయాలు


అంబర్‌పేట వద్ద దెబ్బతిన్న కారు

భీమడోలు : మండలంలోని అంబర్‌పేట వద్ద శుక్రవారం తెల్లవారుజామున అతివేగంగా వెళ్తున్న కారు ముందు వెళ్తున్న లారీని తప్పించబోయి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులోని ముగ్గురు మహిళలకు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హైదరాబాద్‌కు చెందిన దూది శశిధర్ తన కుటుంబ సభ్యులతో కలిసి గురువారం రాత్రి దేవరపల్లి మండలం దుద్దుకూరు బయలుదేరారు. అంబర్‌పేట సమీపంలోకి వచ్చేసరికి ముందు వెళ్తున్న లారీని తప్పించబోయి అదుపు తప్పి ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో శశిధర్ అమ్మ గిరిజ, అక్క సౌజన్య, మేనకోడలికి గాయాలయ్యాయి. కారు పూర్తిగా దెబ్బతింది. పెను ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. రోడ్ సెఫ్టీ పోలీసులు తక్షణం సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులైన ముగ్గురిని అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భీమడోలు ఎస్సై చావా సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ మద్యం సీసాల స్వాధీనం

భీమడోలు: అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యం సీసాలను తరలిస్తున్న ఓ వ్యక్తిని భీమడోలు ఎస్ఈబీ అధికారులు శుక్రవారం అరెస్ట్ చేశారు. అతని నుంచి ఆ రాష్ట్రానికి చెందిన 96 మద్యం సీసాలతో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరు జిల్లాకు చెందిన లారీ డ్రైవర్ పరారయ్యాడు. భీమడోలు ఎస్ఈబీ కార్యాలయంలో ఎస్సై సుబ్బారావుతో కలిసి సీఐ సుబ్రహ్మణ్యం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఉంగుటూరు మండలం నారాయణపురం వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ తరుణంలో ఉంగుటూరు మండలం నారాయణపురానికి చెందిన టి.అశోక్ బైక్‌పై మద్యం సీసాలు అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నారు. బైక్‌తో పాటు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అతన్ని విచారించగా నెల్లూరు జిల్లాకు చెందిన చెవ్వూరి అశోక్ రెడ్డి అనే లారీ డ్రైవర్ తెచ్చి తనకు విక్రయించినట్లు చెప్పాడు. అశోక్‌ను తాడేపల్లిగూడెం ఎస్ఈబీ కోర్టులో హాజరు పర్చగా రిమాండ్ విధించినట్లు తెలిపారు.

గడపగడపకు సంక్షేమం


పోడూరు : మండలంలోని వద్దిపర్రులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్

బేస్‌బాల్, టెన్నికాయిట్‌లో సత్తా


బేస్‌బాల్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన బాలురు

పెదవేగి : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 బేస్‌బాల్, టెన్నికాయిట్ రాష్ట్రస్థాయి టోర్నమెంట్ కం సెలక్షన్స్‌లో ఉమ్మడి పశ్చిమగోదావరి క్రీడాకారులు సత్తాచాటారని రాష్ట్ర బేస్‌బాల్ అధ్యక్షుడు ఎం.అచ్యుతరావు అన్నారు. గత మూడు రోజులుగా పెదవేగి గురుకుల కళాశాలలో జరుగుతున్న పోటీలు శుక్రవారం ముగిశాయి. బహుమతి ప్రదానోత్సవానికి అడిషనల్ స్కూల్ గేమ్స్ సెక్రటరీ ఎం.మనోహర్, ఆంధ్రప్రదేశ్ బేస్‌బాల్ అధ్యక్షుడు ఎం.అచ్యుతరావు, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.భారతి అతిథులుగా పాల్గొన్నారు. టెన్నికాయిట్ బాలురు విభాగంలో ప్రథమ స్థానం ఎల్.త్రిమూర్తులు (తూర్పుగోదావరి), ద్వితీయ స్థానం బి.చంటిబాబు (పశ్చిమగోదావరి), తృతీయ స్థానం ఎం.రాజు (పశ్చిమగోదావరి) సాధించారు. బాలికలు విభాగంలో ప్రథమ స్థానం కే.మౌనిక (పశ్చిమగోదావరి), ద్వితీయ స్థానం ఎస్కే.సీమ రుక్షాన(పశ్చిమగోదావరి), తృతీయ స్థానం పి.జోత్స్న (నెల్లూరు) సాధించారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన వారిలో పశ్చిమగోదావరి నుంచి బి.చంటిబాబు, ఎం.రాజు, కే.మౌనిక ఎస్కె.సీమా రుక్షాన ఉన్నారు. బేస్‌బాల్ బాలుర, బాలికల విభాగంలో పశ్చిమ గోదావరి జట్టు ప్రథమ స్థానం సాధించింది.

నవోదయ పరీక్షకు 31 వరకు గడువు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలోని జవహర్ నవోదయ విద్యాలయాల్లో 6వ తరగతిలో ప్రవేశించడానికి నిర్వహించే ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 31 వరకూ గడువు ఉందని జిల్లా విద్యాశాఖాధికారి డీ.మధుసూదనరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు జవహర్ నవోదయ విద్యాలయ వంటి ప్రతిష్టాత్మక విద్యా సంస్థలో కేంద్రీయ సిలబస్‌తో చదువుకునే అరుదైన అవకాశాన్ని జేఎన్‌వీఎస్‌టీ- 2023 కల్పిస్తోందన్నారు.



వాడవాడలా సంక్రాంతి సంబరాలు

- కళకళలాడుతున్న పల్లెలు
- ప్రతి ఇంటా ముగ్గులు గొబ్బెమ్మలతో సందడి

అత్తిలి: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మండలంలో వాడవాడలా సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. అత్తిలి మండలం మంచిలి గ్రామ సచివాలయం వద్ద రంగవల్లుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేసారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతా రామయ్య, ఎంపీటీసీ సభ్యురాలు దారం శిరీషా, వైఎస్సార్‌సీపీ నాయకులు రాంపండు, రాగిరెడ్డి రాజేంద్రప్రసాద్, సెక్రటరీ శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఉరదాళ్లపాలెం గ్రామసచివాలయ వద్ద ముగ్గుల పోటీ నిర్వహించారు. పోటీలో విజేతలకు సర్పంచ్ శింగంశెట్టి శ్రీనివాస్ బహుమతులు అందజేసారు. అత్తిలి మండల పరిషత్ కార్యాలయం వద్ద సంక్రాంతి సంబరాలు జరిపారు. భోగి మంటను ఎంపీపీ మక్కా సూర్యనారాయణ వెలిగించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వీవీవీఎస్ రామారావు, ఈవోఆర్డీ శ్రీనివాస్, వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. అత్తిలి టీటీడీ కల్యాణ మండప ప్రాంగణంలో వైఎస్సార్‌సీపీ మహిళా కమిటీ ఆధ్వర్యంలో, శుక్రవారం రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా మండలపార్టీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ మాట్లాడుతూ సంక్రాంతిని పురస్కరించుకుని గ్రామాల్లో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ ఛైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, మెహర్ అన్సారీ, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు రంభ సూరిబాబు, ఎస్సీసెల్ అధ్యక్షుడు కోరుకొల్లు వెంకట్రావు, సేవాదళ్ అధ్యక్షుడు కంకటాల సతీష్, పార్టీ నాయకులు సబ్బితి రాజేష్, గంటా నాగరాజు, కాసగాని అబ్బులు, దిరిశాల నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: రంగవల్లులు సంక్రాంతి సంస్కృతిలో ఒక సాంప్రదాయమని, ఈ సంస్కృతిని కొనసాగించాలని ఎఫ్ఎంసీ కంపెనీ ఏరియా మార్కెటింగ్ జోనల్ మేనేజర్ ప్రవీణ్‌రెడ్డి, ఏరియా మేనేజర్ కుమార్‌రాజా అన్నారు. ఎఫ్ఎంసీ ఆధ్వర్యంలో మండలంలోని జగన్నాథపురం గ్రామంలో సంక్రాంతి ముగ్గుల పోటీలను గురువారం రాత్రి నిర్వహించారు. అనంతరం ముగ్గుల పోటీల విజేతలు పుట్టా సాయిస్రవంతి (ప్రథమ), కరుటూరి సత్యవేణి (ద్వితీయ), వంకా రేణుక, పి.సంధ్య (తృతీయ)లకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ సిబ్బంది ఐ.రమేష్, శ్యామ్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పరగూడెం... గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం నెం.150 వద్ద శుక్రవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ కె.విశాలాక్షి, గ్రామ కార్యదర్శి మానస, గ్రామ ఏఎన్ఎం సింధు, దాకే మహ్మద్ రజీనా బేగం, పంతగాని సుబ్బలక్ష్మి, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ హెల్పర్లు పాల్గొన్నారు.

ఇరగవరంలో : మండలంలోని రేలంగి గ్రామంలో శుక్రవారం సంక్రాంతి సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు అధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించడం జరిగింది.ఈ ముగ్గుల పోటీల్లో గ్రామంలోని మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగతాయారు, సర్పంచ్ చేబ్రోలు స్వరాజ్యం, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, గ్రామ పార్టీ అధ్యక్షుడు పులుపు అనిల్ నడుంపల్లిరాంబాబు, గాదిరాజు పెద్దిరాజు, నాయకులు చేబ్రోలు పెద్దిరాజు, మైనం పాము, ఎంపీటీసీ, వార్డు మెంబర్లు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు

తణుకు టౌన్‌లో: సంక్రాంతి సందర్భంగా తణుకు రూరల్ మండలం తేతలి గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ సరెళ్ల క్రాంతి ప్రియ, ఉప సర్పంచ్ కోట నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు సరెళ్ల కృపావరం, సరెళ్ల సతీష్, కోట స్వామీజీ, గ్రామ కార్యదర్శులు గుత్తికొండ వెంకటేశ్వర్లు, ఎం డాక్టర్ బాబు,లతో పాటు సచివాలయ సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ...

సంక్రాంతి సంబరాలను పట్టణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల మధ్య ఉత్సాహంగా నిర్వహించారు. చిన్నారులకు ముగ్గులు పోటీలను నిర్వహించి, చిన్నారులకు బోగిపళ్లు పోశారు. ఈకార్యక్రమాల్లో అంగన్‌వాడీ సిబ్బంది, చిన్నారులు పాల్గొన్నారు.

పెంటపాడులో : పెంటపాడు వెలంపేట, కొండేపాడు శెట్టిబలిజయూత్ సంఘం ఆధ్వర్యంలో సంకాంత్రి పురస్కరించుకొని శుక్రవారం సాయంత్రం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెలమ సంక్షేమ సంఘ సభ్యులు, గౌరీదేవి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, కొండేపాడులో శెట్టిబలిజయూత్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.



అత్తిలి మండల పరిషత్ కార్యాలయంలో భోగిమంట వెలిగిస్తున్న ఎంపీపీ మక్కా సూర్యనారాయణ



తేతలిలో ముగ్గుల పోటీల విజేతలకు మొదటి బహుమతిగా రిఫ్రిజిరేషన్‌ను అందజేస్తున్న గ్రామ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకులు



జగన్నాథపురం గ్రామంలో ఎఫ్ఎంసీ ఆధ్వర్యంలో రంగవల్లుల పోటీలు



రేలంగిలో ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందిస్తున్న నాయకులు



తణుకులో అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల వేషదారణలు

క్లుప్తంగా

క్రీడలతోనే మానసిక ఉల్లాసం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కర్రి విజయలక్ష్మి

తాడేపల్లిగూడెం రూరల్: క్రీడలతోనే మానసిక ఉల్లాసం సాధ్యపడుతుందని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కర్రి విజయలక్ష్మి అన్నారు. ఏవీఆర్ యూత్ ఆధ్వర్యంలో మండలంలోని పెదతాడేపల్లి ఆలపాటి రామచంద్రరావు వ్యవసాయ క్షేత్రంలో రెండు రోజుల పాటు జరగనున్న జిల్లా స్థాయి కబడ్డీ, ముగ్గుల పోటీలను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఆలపాటి వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం ఈ పోటీలను ఏర్పాటు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ యువత చదువుతో క్రీడలపై కూడా మక్కువ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ముద్రగడ లలితకుమారి, ఉపసర్పంచ్ చిట్టూరి కాశీవిశ్వనాథం, ఆలపాటి రామచంద్రరావు (శేఖర్), వీరేశ్వర స్వామి వారి దేవస్థానం ఆలపాటి కాశీ, పసుమర్తి మునీంద్ర, పోతుల సత్తిబాబు, పరిమి వేణు, పరిమి తులసి, కానుమిల్లి రోహిణి, ఆలపాటి శివన్నారాయణ, కారింకి వీర్రాజు, భోగెళ్ళ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామ దేవతల ఉత్సవాలు ప్రారంభం

పెంటపాడు: మండలంలోని ఈనెల 14న ఉదయం ఉమామహేశ్వరం గ్రామ దేవత పెంటమ్మ అమ్మవారి ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు గ్రామ ప్రముఖులు రాయుడు శ్రీనివాసరావు తెలిపారు. 14న ఉదయం అమ్మవారికి డప్పులతో మేలుకొలుపు, అభిషేకం జరుగుతాయన్నారు. 15న గ్రామోత్సవం జరుగుతుందన్నారు.

14న పారుపల్లి అమ్మవారి ఉత్సవాలు

సంక్రాంతి పురస్కరించుకొని జట్లపాలెం గ్రామ దేవత పారుపల్లి అమ్మవారి ఉత్సవాలు ఈనెల 14 నుంచి ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. 15న ప్రత్యేక పూజలు, అర్చనలు, కుంకుమపూజలు, 16న కోలాటం కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

17న బోడపాడులో:

ఈనెల 17న బోడపాడు గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మవారి ఉత్సవాలు పురస్కరించుకొని గ్రామస్తుల ఆధ్వర్యంలో భారీ జాతర, ఊరేగింపు జరగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 18న అమ్మవారికి నైవేద్యాలు సమర్పిస్తారన్నారు.

ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని మలేరియా జిల్లా సహాయ అధికారి పి.శ్రీనివాసరావు, సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు పేర్కొన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రాలైన కడకట్ల, యాగర్లపల్లి, వీకర్స్‌కాలనీ, బేబిసెంటర్ ఏరియాల్లో శుక్రవారం డ్రై డే, ఫ్రైడే కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో అధికారులతో పరిశీలన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా జిల్లా సహాయ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వారంలో ఒకరోజు డ్రైడే కార్యక్రమాలను ఖచ్చితంగా అమలు చేస్తే దోమలను అరికట్టవచ్చునని తెలిపారు. ఆరోగ్యశాఖ అధికారులకు, పారిశుధ్య సిబ్బందికి ప్రజలు తప్పనిసరిగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యదర్శులు జయశీల, రాజేశ్వరీ, మేరీ, మంగతాయరు, కాంతారావు, వార్డు ప్రతినిధులు చామన ప్రసాద్, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

బలుసులమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ధనుర్మాసం సందర్భంగా పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారి ఆలయం వద్ద శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారిని వెండి చీర, వెండి ఉయ్యాలా, వెండి పుష్పాలు, వివిధ వస్తువులతో అలంకరణ నిమిత్తం వెండి అందజేసిన దాతలకు ఉత్సవ కమిటీ వారిచే నూతనంగా ముద్రించిన క్యాలెండర్లును పంపిణీ చేశారు. అమ్మవారి ఆలయం వద్ద భారీ అన్నసమారాధన జరిగింది. అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించారు.

లయన్స్ వ్యవస్థాపకుడు మెల్విన్‌కు నివాళి

తణుకు టౌన్: లయన్స్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు మెల్విన్ జోన్స్ జయంతి సందర్భంగా తణుకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రోడ్డు పక్కన చెప్పులు కుట్టుకునే చర్మకారులకు గొడుగులు పంపిణీ చేశారు. శనివారం తణుకు లయన్స్ క్లబ్ వద్ద గల మెల్విన్ జోన్స్ విగ్రహానికి లయన్స్ క్లబ్ సభ్యులు పూలమాలలు వేసి నివాళ్లుఅర్పించారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పీ నాగభూషణం, మాజీ ఎమ్మెల్యే చిట్టూరి వెంకటేశ్వరరావు, లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ డీ రంగారావు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, వై నారాయణరావు, ఎం రవి రిజనాల్డ్, గమిని రాజా తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీదేవి మహంకాళమ్మ వార్షిక మహోత్సవాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): శ్రీదేవి మహంకాలమ్మ 43వ వార్షిక మహోత్సవములు జనవరి 14వ తేదీ నుంచి జనవరి 23 వరకు పది రోజుల పాటు టూ టౌన్‌లోని కొబ్బరితోటలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు యెగ్గిన నాగబాబు పేర్కొన్నారు. పట్టణంలో శుక్రవారం నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆలయం వద్ద 14వ తేదీన సాయంత్రం కలశ స్థాపన, భీమవరం మావుళ్ళమ్మ అమ్మవారి దేవస్థానం వారిచే దేవి మహంకాళమ్మ అమ్మవారికి సారె, చీర బహుకరణ, అమ్మవారి జాతర ప్రారంభం కావడంతో పాటు జాతర కళారూపాలతో రథోత్సవం జరుగుతుందని తెలిపారు. 15వ తేదీన ఆదివారం రాత్రి నేమాని నాగలక్ష్మిచే రుక్మిణి కల్యాణం హరికథ, 16వ తేదీన సోమవారం రాత్రి గరికపాటి నరసింహారావుచే ఆధ్యాత్మిక ప్రవచనం, 17వ తేదీ మంగళవారం రాత్రి రాక్ స్టార్ ఆర్కెస్ట్రావారిచే మ్యూజికల్ నైట్, 18వ తేదీన బుధవారం రాత్రి అంబికా డ్యాన్స్ అకాడమి వారిచే కూచిపూడి జానపథం, రింగ్ ప్యూజల్ ప్రదర్శన, 19వ తేదీన గురువారం రాత్రి శ్రీదేవి కళా సమితి వారిచే వీరాభిమన్యు బుర్రకథ, 20వ తేదీన శుక్రవారం రాత్రి కొరియోగ్రాఫర్ నాని మాస్టర్‌చే డ్యాన్స్ షో, 21వ తేదీన శనివారం రాత్రి నవ్య ఈవెంట్స్ వారిచే మ్యాజిక్ షో, మిమిక్రీ, 22వ తేదీన ఆదివారం రాత్రి తోలు బొమ్మలాట, 23వ తేదీ సోమవారం అఖండ అన్నసమారాధన, రాత్రి మోహన్స్ ఆర్కెస్ట్రాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలను ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా మహోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో వెలనాటి సత్తిబాబు, ముక్కు సత్యనారాయణ, శివయ్య, తులా ఆదినారాయణ, రాఘవులు, రాంబాబు, సురేష్, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



శ్రీదేవి మహంకాళమ్మ వార్షిక మహోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యెగ్గిన నాగబాబు తదితరులు



శ్రీదేవి మహంకాళమ్మ అమ్మవారు

సంప్రదాయబద్ధంగా సంక్రాంతిని జరుపుకోవాలి

తాడేపల్లిగూడెం రూరల్: సంప్రదాయబద్ధంగా ఈ సంక్రాంతిని జరుపుకోవాలని జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ అన్నారు. తాడేపల్లిగూడెం పట్టణంలోని రూరల్ సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం సంక్రాంతి సంబరాలను ఆయన భోగి మంటలు వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రవి ప్రకాష్ మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో వచ్చే అతిపెద్ద పండుగ సంక్రాంతి అని, కోడిపందాలు, పేకాట, గుండాట వంటి జూదక్రీడలకు దూరంగా ఉండాలన్నారు. అందరూ సంక్రాంతి పండుగను జరుపుకుంటుంటే తాము మాత్రం విధి నిర్వహణలో ఉంటామన్నారు. జిల్లా ఏఎస్పీ సుబ్బరాజు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ ఒక వసంతం లాంటిదన్నారు. భీమవరం డీఎస్పీ బి.శ్రీనాథ్ మాట్లాడుతూ సంక్రాంతిని ప్రజలందరూ పండగలా జరుపుకోవాలన్నారు. సాంప్రదాయబద్ధంగా ఈ పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పట్టణ, రూరల్ సీఐ నాగరాజు, ఎస్‌వీవీఎస్.మూర్తి, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం రూరల్ సర్కిల్ కార్యాలయం వద్ద భోగిమంటలను వెలిగిస్తున్న జిల్లా ఎస్పీ రవిప్రకాష్

పేదలకు దుస్తుల పంపిణీ

అత్తిలి: మండలంలో బొంతా సుబ్బారావు మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేసారు. ఫౌండేషన్ ఛైర్మన్ బొంతా బాలగంగాధర్‌తిలక్ ఆర్థిక సహకారంతో కాలువగట్లపై జీవిస్తున్న నిరుపేదలకు దుస్తులు అందజేసారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ 24 ఫౌండేషన్ కన్వీనర్ బొంతా మేరీరత్నం, వైఎస్సార్‌సీపీ నాయకురాలు బొంతా చిట్టిమరియమ్మ, గ్రంటా నాగరాజు, ఈదూరి శ్యాంబాబు, ఇంజే రమేష్ పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

పెంటపాడు: సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు జూదాలకు ఎలాంటి అనుమతులూ లేవని పెంటపాడు ఎస్సై జి.సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం సాయంత్రం దర్శిపర్రు, రాచర్ల గ్రామాల్లోని కోడిపందేల బరులను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మండలంలో ఎక్కడా కోడి పందేలు జరుగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని, ఎక్కడైనా బరులు ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అత్తిలిలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న 1977 బ్యాచ్ పూర్వపు విద్యార్థులు



ఏలేటి పాడులో కృష్ణశాస్త్రి దంపతులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

అత్తిలి: స్థానిక అత్తిలి జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం లయన్స్‌క్లబ్ భవనంలో నిర్వహించారు. కళాశాలలో చదవుకున్న 1977లో చదువుకున్న ఎస్ఎస్‌సీ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. అప్పటి అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. తమ కళాశాలలో జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా విశ్రాంతి ఉద్యోగుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పమ్మి గోపాలకృష్ణమూర్తి మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల దాతృత్వం వల్ల విద్యాసంస్థలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. పూర్వ విద్యార్థులు ఉన్నత స్థితికి చేరుకుని దేశ, విదేశాల్లో స్థిరపడ్డారని, వారంతా సమాజ సేవచేయడంతో పాటు విద్యాసంస్థల అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి తాడిమేటి హరికృష్ణ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రూ.20వేలు విలువగల మైక్‌సెట్‌ను పాఠశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ దూసంపూడి శ్రీనివాసరావుకు బహూకరించారు. పూర్వవిద్యార్థులు ఆనాటి గురువులు పమ్మిగోపాలకృష్ణమూర్తి, దేవరకొండ రామశ్రాస్తులు, కేదామ్ జనార్ధనరావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు ప్రధానోపాధ్యాయులు గొడవర్తి సత్యనారాయణ, జీవీవీ సత్యనారాయణ, కుక్కల సత్యనారాయణ, శిరిగినీడి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఇరగవరంలో...

ఇరగవరం మండలం ఏలిటిపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో 1987–88 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం జరిగింది. 32సంవత్సరాల తర్వాత కలిసిన వారి ఆనందానికి హద్దులు లేకుండా పోయింది. ఆ నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆనందంగా గడిపారు. తమకు చదువు నేర్పిన ఉపాధ్యాయుడు కృష్ణశాస్త్రీని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి డా.కె.ఎస్.రాజు, రంకిరెడ్డి రామ్మోహరరావులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కృష్ణశాస్త్రీ విద్యార్థులకు నిస్వార్థంగా సేవలందించారని పేర్కొన్నారు. ఎన్ఆర్ఐ చింతా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ శాస్త్రీ దగ్గర విద్యను అభ్యసించడం వల్ల చైనాలోని ఒక ఫార్మా కంపెనీకి వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యువటూరి చంద్రశేఖర్, అల్లూరి పాండురాజు, పరిమి వెంకటేశ్వర శర్మ, వైఎస్సార్ సీపీ నాయకులు సత్తి శ్రీనివాసరెడ్డి (బాబు), తణుకు ఏపీపీ వెలగల సాయిబాబారెడ్డి, కె.వి.వి.సత్యనారాయణరెడ్డి(గిరిరెడ్డి), పేకేరు సర్పంచ్ బెల్లపు కొండ హేమకుమారి, దొమ్మేటి శ్రీను, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.